TGTEL/25/A4812

Voice of Vande Bharath

# వాయిస్ ఆఫ్ వందే భారత్

తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 99 | పేజీలు : 04| వెల: రూ.3/-

తెలంగాణ

ఆదివారం | నవంబర్ 08, 2026

# కొడంగల్‌లో 'మెగా రైతు మేళా'

- ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- వ్యవసాయం, పారిశ్రామిక ఉత్పత్తులు, గ్రీన్ టెక్నాలజీ స్టాళ్ల ప్రదర్శన
- ఆధునిక సాగు మెళకువలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సీఎంపిలుపు
- హాజరైన స్పీకర్ ప్రసాద్ కుమార్, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు

**కారాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని హకీంపేటలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన 'మెగా రైతు మేళా మరియు పారిశ్రామిక ప్రదర్శన'ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. శనివారం నిర్వహించిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వర రావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వాకిటి శ్రీహరి, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిలతో పాటు ఎంపీలు, ప్రజాప్రతినిధులు మరియు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## • స్టాళ్లను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

ప్రారంభోత్సవం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహచర మంత్రులు, అధికారులతో కలిసి మేళాలో ఏర్పాటు చేసిన వివిధ ప్రదర్శన స్టాళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడ అందుబాటులో ఉంచిన ఉత్పత్తులు, పరికరాల విశేషాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రైతులందరూ ఈ ప్రదర్శనను సందర్శించి, వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాగు మెళకువలను తెలుసుకోవాలని కోరారు.

## • సాంకేతికత.. పారిశ్రామిక ఉత్పత్తుల సమాహారం

ఈ మేళాలో రైతులకు అవసరమైన ఆధునిక వ్యవసాయ పరికరాలు, యంత్రాలు, పనిముట్లు, ఉత్పత్తులతో పాటు పలు పారిశ్రామిక ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచారు. వీటితో పాటు ఏరోస్పేస్, రక్షణ రంగాలకు చెందిన అత్యాధునిక సాంకేతికత, గ్రీన్ టెక్నాలజీ, పునరుత్పాదక ఇంధన వనరులు మరియు వ్యవసాయ ఆధారిత పరిశ్రమల సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రత్యేక స్టాళ్ల ద్వారా ప్రదర్శించారు.



# డిండి ఎత్తిపోతలపై రాజకీయం తగదు..

**గోదావరి-కృష్ణా అనుసంధానమే శాశ్వత పరిష్కారం**

**తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**


2లో..


4లో..

# 'దుకాణం బాగా నడుపు.. అమ్మను మంచిగా చూసుకో'

- చిరు వ్యాపారిని సుతిమెత్తగా హెచ్చరించిన జగ్గారెడ్డి
- సంగారెడ్డి గంజ్ మైదాన్ వద్ద కల్లు కాంపౌండ్ లో మిర్చీ వ్యాపారితో జగ్గారెడ్డి సరదా ముచ్చట
- వ్యాపారం కోసం రూ. 10 వేల ఆర్థిక సాయం

# రైతుల కష్టాలు పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపాటు
- దొంతాపూర్ ఎండిపోతున్న పొలాలను పరిశీలించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- సాగునీరు అందక రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని ఆగ్రహం
- నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలని డిమాండ్


2లో..

# కొడంగల్ ఎత్తిపోతల పథకం టెండర్లలో పాంగులేటి కంపెనీకి లబ్ధి

- కేటీఆర్ సంచలన ఆరోపణలు
- మంత్రి పొంగులేటి సొంత కంపెనీకే పనులు దక్కేలా టెండర్లలో అవకతవకలు
- రూ. 1,450 కోట్లుగా ఉన్న ప్రాజెక్టు అంచనా వ్యయం ఏకంగా రూ. 6,825 కోట్లకు పెంపు
- చుక్క నీరు ఇవ్వకుండానే ఐదు రెట్లు వ్యయం పెంచి ప్రజాధనం దోపిడీ
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్


2లో..

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
ఆదివారం, నవంబర్ 08, 2026

# గౌడ సంఘం ఆత్మగౌరవ భవనానికి రూ.5 కోట్ల నిధులు మంజూరు

**టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ కు ప్రతినిధుల కృతజ్ఞతలు**



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** గౌడ సంఘం ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయడం పట్ల గౌడ సంఘం ప్రతినిధులు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ను సంఘ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వం నుండి నిధుల మంజూరుకు ప్రత్యేక చొరవ చూపినందుకు ఆయనకు పూలమాలలు, పొన్నాడలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ.. గౌడ సామాజిక వర్గ అభ్యున్నతికి, ఐక్యతకు ప్రతీకగా నిలిచేలా ఈ ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అందించిన ఈ సహకారం గౌడ సంఘం ఆత్మగౌరవాన్ని మరింత పెంపొందించడమే కాకుండా, భవిష్యత్తులో సామాజిక వికాసానికి, సంఘటిత శక్తికి ఒక చిరస్థాయి కేంద్రంగా రూపుదిద్దుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల కార్పొరేషన్ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్, వైస్ చైర్మన్ నాగరాజు గౌడ్, పీపీ దయాకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు సత్యం గౌడ్, రామారావు గౌడ్, చక్రవర్తి గౌడ్, రామన్ గౌడ్, శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# డిండి ఎత్తిపోతలపై రాజకీయం తగదు..

- గోదావరి-కృష్ణా అనుసంధానమే శాశ్వత పరిష్కారం
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



**నల్గొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నల్గొండ జిల్లా నీటి సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ఎల్లూరు-ఎదుల ద్వారా డిండికి నీళ్లు తేవడం అసాధ్యమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే అధికార పార్టీ నేతలు మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల మధ్య పంచాయితీ పెడుతున్నారని ఆమె మండిపడ్డారు. డిండి రిజర్వాయర్ వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. కృష్ణా నదిలో నీటి లభ్యత లేని ప్రస్తుత తరుణంలో ఎదుల నుంచి డిండికి నీటిని తరలించడం అసాధ్యమని తేల్చిచెప్పారు. శ్రీశైలం నుంచి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకే పూర్తిస్థాయిలో 2 టీఎంసీల నీళ్లు తీసుకోవడం కష్టమని, అలాంటిది అదనంగా మరో సోర్స్ కోసం తవ్వకాలు జరిపితే కల్వకుర్తి, నార్లపూర్ పంప్‌హౌస్‌లకు తీవ్ర ప్రమాదం వాటిల్లుతుందని హెచ్చరించారు.

### • శాశ్వత పరిష్కారం ఇదే..

నల్గొండ జిల్లాలో తాగు, సాగునీటి సమస్యలు పూర్తిగా తీరి, ఫ్లోరైడ్ భూతం వదిలిపోవాలంటే గోదావరి – కృష్ణా నదులను అనుసంధానించడమే ఏకైక మార్గమని కవిత పునరుద్ఘాటించారు. ఇప్పటికే 80 శాతం పూర్తయిన బస్వాపూర్ రిజర్వాయర్‌ను వెంటనే పూర్తి చేసి, దాని ద్వారా గోదావరి జలాలను డిండి ఎత్తిపోతలకు మళ్లించాలని డిమాండ్ చేశారు. తుపాకులగూడెం వద్దే గోదావరి-కావేరి అనుసంధానం జరగాలని ఆమె కోరారు.

### • ప్రభుత్వాలు, ప్రతిపక్షాలపై ఫైర్..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాల్లో తాను కూడా భాగస్వామిగా ఉన్నానని అంగీకరించిన కవిత.. నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ ప్రాజెక్టులను గాలికొదిలేసిందని విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ 'నాన్-పర్ఫార్మింగ్ అసెట్' గా మారిపోయిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రత్యామ్నాయ పరిష్కారాలు చూపుతున్నది కేవలం తమ పార్టీయేనని స్పష్టం చేశారు. పంటలు వేయవద్దంటున్న ప్రభుత్వం రైతులకు ఎకరాకు రూ. 25 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజల కోసం నిజాయితీగా పోరాడుతున్న తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆమె పిలుపునిచ్చారు.

# కొడంగల్ ఎత్తిపోతల పథకం టెండర్లలో పొంగులేటి కంపెనీకి లబ్ధి

- కేటీఆర్ సంచలన ఆరోపణలు
- మంత్రి పొంగులేటి సొంత కంపెనీకే పనులు దక్కేలా టెండర్లలో అవకతవకలు
- రూ. 1,450 కోట్లుగా ఉన్న ప్రాజెక్టు అంచనా వ్యయం ఏకంగా రూ. 6,825 కోట్లకు పెంపు
- చుక్క నీరు ఇవ్వకుండానే ఐదు రెట్లు వ్యయం పెంచి ప్రజాధనం దోపిడీ
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కోడంగల్–నారాయణపేట–మక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్ల కేటాయింపు ప్రక్రియలో కాంగ్రెస్ ప్రభుత్వం భారీ కుంభకోణానికి పాల్పడుతోందని, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన కంపెనీకి అనుచిత ప్రయోజనం చేకూర్చేలా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం ఆయన సామాజిక మాధ్యమం X (ట్విట్టర్) వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు.

### • డమ్మీ కంపెనీలతో ఏకపక్ష టెండర్లు:

తలకిందులుగా పడినా గెలుపు తమదే అన్నట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి ఉందని కేటీఆర్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పిలిచిన ఈ ప్రాజెక్టు టెండర్లలో మంత్రి పొంగులేటి సొంత కంపెనీ పాల్గొనగా, పోటీలో ఉన్న మిగతా కంపెనీలన్నీ కేవలం కాగితాలపైనే ఉన్న డమ్మీ సంస్థలని ఆరోపించారు. ఒక్క కంపెనీ మాత్రమే రన్ చేసి గెలిచేలా టెండర్ల ప్రక్రియను మార్చేసి, పారదర్శకతకు తిలోదకాలిచ్చారని మండిపడ్డారు.

### • అంచనా వ్యయం ఐదు రెట్లు పెంపు:

2014లో సుమారు రూ. 1,450 కోట్లుగా ఉన్న కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని ప్రస్తుతం రూ. 6,825 కోట్లకు పెంచేశారని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ఇప్పటివరకు ఒక్క చుక్క నీరు కూడా ప్రజలకు అందించకుండానే, ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని ఈ స్థాయిలో దోచేస్తున్నారని విమర్శించారు.

### • ట్యాంకర్ల కోసం ప్రజలు.. దోపిడీలో కాంగ్రెస్ నేతలు:

రాష్ట్రంలో ప్రజలు తాగడానికి నీరు లేక ట్యాంకర్ల వద్ద క్యూ లైన్లలో నిలబడుతుంటే, కాంగ్రెస్ నాయకులు మాత్రం సాగునీటి ప్రాజెక్టుల అంచనాలు పెంచి తెలంగాణ సంపదను పగటిపూట దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దోపిడీని వర్ణించడానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఒక కొత్త పదాన్ని వెతికి పెట్టాలని కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణలో జరుగుతున్న ఈ దోపిడీ ముందు 'క్రోనీ క్యాపిటలిజం', 'పగటిపూట దోపిడీ', 'క్లెప్టోక్రసీ' వంటి పదాలు కూడా చాలా చిన్నవి అయిపోతున్నాయని ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

# రైతుల కష్టాలు పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపాటు
- దొంతాపూర్ ఎండిపోతున్న పొలాలను పరిశీలించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- సాగునీరు అందక రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని ఆగ్రహం

**జగిత్యాల/ధర్మపురి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** సాగునీరు అందక ఎండిపోతున్న పంటలను చూసి రైతులు ఆందోళన చెందుతుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దొంతాపూర్ గ్రామంలో నీరందక ఎండిపోతున్న వరి, పత్తి పొలాలను ఆయన స్వయంగా పరిశీలించారు. పంటలు ఎండిపోయి తీవ్ర మనోవేదనకు గురవుతున్న మండల లింగయ్య, మండల భీమయ్య, చంద్రయ్య తదితర రైతులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి లేదని రైతులు ఈ సందర్భంగా వాపోయారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ సహకారంతో రూ.400 కోట్ల వ్యయంతో ఆర్ఎఫ్ఎల్ నుండి ముత్తూరు వరకు 14 లిఫ్ట్‌లను ఏర్పాటు చేశామని, అందులో దొంతాపూర్ లిఫ్ట్ ఒకటని గుర్తుచేశారు. గత 6 నెలలుగా ఈ లిఫ్ట్‌లో 2–3 మోటార్లు పాడైనా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. స్థానిక మంత్రి వివేక్ వెంకటస్వామి రైతుల సమస్యలు పట్టించుకోకుండా కలెక్టర్ వద్దకు వెళ్లాలని చెప్పడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. ఎల్ నినో ప్రభావంతో కరువు వస్తుందని తెలిసినా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. సీఎం, మంత్రులు "ఏ పంట వేయకండి" అని ప్రచారం చేయడం వల్లే రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయన్నారు. గోదావరిలో నీళ్లున్నా కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోయడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలోని 365 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినా రూపాయి సాయం అందించలేదని, రైతుబంధు, రైతుబీమాలను సక్రమంగా అమలు చేయడం లేదని ధ్వజమెత్తారు. కరోనా వంటి క్లిష్ట సమయంలో కూడా కేసీఆర్ రైతు సంక్షేమాన్ని ఆపలేదని గుర్తుచేశారు. కాళేశ్వరం పిల్లర్లను రిపేర్ చేసి ఉంటే సస్యశ్యామలంగా ఉండేదని, ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే నేడు రైతులు రోడ్డున పడ్డారని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంతోనే రైతాంగానికి మనశ్శాంతి లభిస్తుందన్నారు. తక్షణమే స్పందించి ఎండిపోయిన ప్రతీ ఎకరాకు నష్టపరిహారం అందించాలని, కరువు మండలాల రైతులకు ఆర్థిక సహాయం విడుదల చేయాలని కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, అయ్యోరి రాజేష్, సంగి శేఖర్, పలువురు బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.



వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
ఆదివారం, నవంబర్ 08, 2026

# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- హైదరాబాద్ డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్లా శ్రీనివాస్
- గర్భిణులు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని వైద్యాధికారులకు సూచన
- బొల్లారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రజా ఆరోగ్యమే పరమావధిగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు అన్ని రకాల నాణ్యమైన వైద్య సేవలు అందించాలని హైదరాబాద్ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్లా శ్రీనివాస్ వైద్యాధికారులను, సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన కంటోన్మెంట్ పరిధిలోని బొల్లారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, ల్యాబొరేటరీ, రికార్డులు, పరిశుభ్రతను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. గర్భిణులు, పిల్లల వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించిన డీఎంహెచ్ఓ, పిల్లలకు 100% వ్యాధి నిరోధక టీకాల లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయాలన్నారు. టీకాల శీతలీకరణ నిర్వహణ పకడ్బందీగా ఉండాలని సూచించారు. అర్హులైన బాలికలను గుర్తించి హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను త్వరితగతిన వేయించాలని, నాన్-కమ్యూనికేబుల్ డిసీజ్ సర్వే, స్క్రీనింగ్, ఫాలో-అప్‌లను రోజూ నిర్వహిస్తూ సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. వైద్యాధికారులు, సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. అన్ని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానల్లో అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు క్రమం తప్పకుండా మందులు అందించాలని తెలిపారు. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఇంటింటి ఆరోగ్య సర్వేలు నిర్వహించడంతో పాటు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం బొల్లారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని సందర్శించిన డీఎంహెచ్ఓ.. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్, ఆయుష్ మెడికల్ ఆఫీసర్, డెంటల్ వైద్యులు, సిబ్బందితో మాట్లాడి ఆయా విభాగాల ద్వారా అందుతున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సాయిబాబా, జిల్లా మలేరియా అధికారి ఎస్.ఆంజనేయులు, బొల్లారం యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అవంతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం.కుమార్ ని కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి

- యూనివర్సిటీ నాన్-టీచింగ్ ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘ చర్చ
- సమస్యల పరిష్కారానికి వీసీ సానుకూల స్పందన



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మహబూబ్ నగర్ – రంగారెడ్డి – హైదరాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీ సందర్భంగా యూనివర్సిటీ నాన్-టీచింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సుదీర్ఘ సమస్యలను ఆయన వీసీ దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగుల సంక్షేమంతో పాటు వారి సమస్యల తక్షణ పరిష్కారం ఆవశ్యకతపై వీసీతో సామ రామ్మోహన్ రెడ్డి సుదీర్ఘంగా చర్చించారు. నాన్-టీచింగ్ సిబ్బంది సమస్యల పట్ల వీసీ ప్రొఫెసర్ కుమార్ సానుకూలంగా స్పందిస్తూ, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

# ఆడెపు రాజేందర్ కుటుంబానికి పరామర్శ..

ఆర్థిక సాయం అందజేసిన ఎమ్మెల్యే కొండా సురేఖ



**వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వరంగల్ తూర్పు శాసనసభ్యురాలు, మాజీ మంత్రి కొండా సురేఖ శనివారం 20వ డివిజన్‌లో పర్యటించారు. డివిజన్‌కు చెందిన హోటల్ సాగర్ అన్న ఆడెపు రాజేందర్ ఇటీవల మృతి చెందగా, వారి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే కొండా సురేఖ శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాజేందర్ చిత్రపటానికి అంజలి ఘటించిన అనంతరం, వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసి, అన్ని వేళలా అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోపాల నవీన్ రాజ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్, 20వ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ క్యాతం రవీందర్, ఎండి మక్బూల్, నామిళ్ల లావణ్య, అజర్, రమేష్, రాజేష్, మధుకర్, గూడూరు రమేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణహిత దీపావళి జరుపుకోవాలి

- బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి

**హన్మకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** దీపావళి పండుగ సందర్భంగా ప్రజలందరూ సురక్షితమైన, పర్యావరణహితమైన 'గ్రీన్ దీపావళి'ని జరుపుకోవాలని సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. పండుగ సంబరాల్లో ప్రమాదాలకు తావులేకుండా ఉండేందుకు బాణసంచా కాల్చేటప్పుడు ప్రజలు పాటించాల్సిన పలు ముఖ్యమైన సూచనలు మరియు జాగ్రత్తలను ఆయన వివరించారు. చిన్నపిల్లలు కచ్చితంగా పెద్దల పర్యవేక్షణలోనే బాణసంచా కాల్చాలి. బాణసంచా కాల్చే ప్రాంతంలో నీళ్లు, ఇసుక బకెట్లను అందుబాటులో ఉంచుకోవాలి. మండుతున్న బాణసంచా దగ్గరకు వెళ్లి చూడకూడదు. వెలగని లేదా పేలని బాణసంచాను తిరిగి వెలిగించేందుకు ప్రయత్నించకూడదు. ఇళ్ల సమీపంలో, ఇరుకైన వీధుల్లో మరియు జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో బాణసంచా కాల్చవద్దు. చెవులకు హాని కలిగించే, విపరీతమైన పెద్ద శబ్దాలు వచ్చే బాంబులకు దూరంగా ఉంటూ శబ్ద కాలుష్యాన్ని తగ్గించాలి. బాణసంచా కాల్చే సమయంలో కాటన్ దుస్తులు ధరించాలి. లూజ్‌గా ఉండే సింథటిక్ దుస్తులకు దూరంగా ఉండాలి. కాలిన గాయాలేవైనా సంభవిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ప్రమాదాలు సంభవించినప్పుడు తక్షణమే ఫైర్ సర్వీస్ 101 లేదా అత్యవసర సహాయం 112 నంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలి. పండుగ ఆనందం అందరి జీవితాల్లో సంతోషపు వెలుగులు నింపాలని, ప్రమాదాలు, కాలుష్యం లేని విధంగా ప్రతి ఒక్కరూ దీపావళి వేడుకలు జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.



# స్మశానంలో నివసిస్తున్న వృద్ధురాలికి బండి సంజయ్ బాసట..

- రూ.50 వేల ఆర్థిక సాయం
- కలెక్టర్ గరీమా అగర్వాల్‌తో సంభాషణ..
- డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరుకు హామీ
- ఆదుకునేందుకు ముందుకు వచ్చిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి



**రాజన్న సిరిసిల్ల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** సొంత ఇల్లు లేక శ్మశానాన్నే నివాసంగా మార్చుకుని, అనారోగ్యంతో బాధపడుతున్న కుమారుడితో కలిసి దుర్భర జీవితం గడుపుతున్న రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం కిష్టంపేటకు చెందిన మర్రిపల్లి అమృతకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బాసటగా నిలిచారు. అమృత దయనీయ పరిస్థితి తెలుసుకున్న ఆయన తక్షణ సాయంగా రూ.50,000 నగదును పంపించారు. శనివారం బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ద్వారా ఈ నగదు మొత్తాన్ని బాధితురాలికి అందజేశారు. నగదు సాయం అందించడంతో పాటు బండి సంజయ్ స్వయంగా జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్‌తో ఫోన్‌లో మాట్లాడి అమృత దుస్థితిని వివరించారు. ఆమె కుటుంబానికి తక్షణమే డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్.. అమృతకు త్వరలోనే డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు అనారోగ్యంతో ఉన్న కొడుకుతో కలిసి శ్మశానంలో నివసిస్తున్న అమృతకు పార్టీ శ్రేణులు అన్ని విధాలా అండగా నిలవాలని బండి సంజయ్ ఆదేశించారు.

డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరైన వెంటనే ఆ ఇంటికి అవసరమైన సామగ్రితో పాటు ఆ కుటుంబానికి సరిపడా నిత్యావసర సరుకులను స్వయంగా సమకూర్చాలని బీజేపీ నాయకులకు సూచించారు

# తెలంగాణ తొలి వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగ్ రావును సత్కరించిన ఎంపీ చామల




**భువనగిరి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రాష్ట్ర తొలి వెలమ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన జువ్వాడి నర్సింగ్ రావును భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన నర్సింగ్ రావుకు ఎంపీ చామల శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేషన్ చైర్మన్‌గా ఆయన నేతృత్వంలో సంక్షేమ కార్యక్రమాలు దిగ్విజయంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
ఆదివారం, నవంబర్ 08, 2026

# పట్టభద్రుల ఓటరు నమోదు ఫారాలను అందజేసిన నాయకులు

- అభినందించిన మన్నె గోవర్ధన్ రెడ్డి
- సోమాజిగూడ డివిజన్‌లో ముమ్మరంగా పట్టభద్రుల ఓటరు నమోదు



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాబోయే మహబూబ్‌నగర్ – రంగారెడ్డి – హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా, సోమాజిగూడ డివిజన్ పరిధిలోని ఎంఎస్ మక్త ప్రాంతంలో సేకరించిన 150 దరఖాస్తు ఫారాలను శనివారం ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డికి నాయకులు అందజేశారు. బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఎంజీఆర్ క్యాంపు కార్యాలయంలో హైమద్ భాయ్, అబ్దుల్ మజీద్, షేక్ ఇర్ఫాన్, బుడ్డన్ ఖాన్, అబ్దుల్ జబ్బార్ ఈ ఫారాలను ఆయనకు సమర్పించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు కార్యక్రమాన్ని వేగవంతంగా చేపట్టిన హైమద్ భాయ్ మరియు ఇతర నాయకులను మన్నె గోవర్ధన్ రెడ్డి గారు అభినందించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడూ ఓటరుగా నమోదు చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# బీఆర్ఎస్ కార్యకర్తలకు ఇన్సూరెన్స్ పాలసీని పునరుద్ధరించాలి

- కేసీఆర్, కేటీఆర్‌లకు ఇమ్మడి శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి
- ఆపదలో ఉన్న కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలి
- పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యం



**జనగామ/నర్మేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 60 లక్షల మంది భారత రాష్ట్ర సమితి కుటుంబ సభ్యులకు గతంలో అమలు చేసిన ఇన్సూరెన్స్ పాలసీని వెంటనే పునరుద్ధరించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, నర్మేట పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇమ్మడి శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఈ మేరకు పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావులకు ఆయన శనివారం ఒక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఇమ్మడి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, పార్టీని నమ్ముకుని పనిచేసిన ప్రతి కార్యకర్తకూ బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా నిలిచిందని గుర్తుచేశారు. రాత్రింబవళ్లు శ్రమించే కార్యకర్తల సంక్షేమం, వారి కుటుంబాల భద్రత కోసం గతంలో అమలు చేసిన ఇన్సూరెన్స్ పాలసీ ఎంతో భరోసానిచ్చిందన్నారు. వర్తమాన పరిస్థితుల్లో కార్యకర్తలకు ఆర్థిక భద్రత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఈ పథకాన్ని పునరుద్ధరించడం ద్వారా లక్షలాది కుటుంబాల్లో ధైర్యాన్ని నింపవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా జనగామ జిల్లాలో పార్టీని నమ్ముకుని ప్రజాప్రతినిధులుగా ఎదిగిన పలువురు కార్యకర్తలు, నాయకులు ఇటీవల ఆర్థిక, ఇతర ఇబ్బందులతో ఆత్మహత్యలకు పాల్పడటం తీవ్ర ఆవేదన కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టకాలంలో ఉన్న అటువంటి నాయకులు, కార్యకర్తల కుటుంబాలను పార్టీ అధిష్టానం వెంటనే ఆదుకుని ఆర్థికంగా, నైతికంగా అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలే ప్రధాన పునాది అని, వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ తగిన గుర్తింపు, గౌరవం కల్పించాలని కోరారు. కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతూ బీఆర్ఎస్ పార్టీకి మళ్లీ పూర్వ వైభవం తీసుకురావడానికి పార్టీ నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఇమ్మడి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు.

# "దుకాణం బాగా నడుపు.. అమ్మను మంచిగా చూసుకో"

- చిరు వ్యాపారిని సుతిమెత్తగా హెచ్చరించిన జగ్గారెడ్డి
- సంగారెడ్డి గంజ్ మైదాన్ వద్ద కల్లు కాంపౌండ్ లో మిర్చీ వ్యాపారితో జగ్గారెడ్డి సరదా ముచ్చట
- వ్యాపారం కోసం రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేత

**సంగారెడ్డి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** "దుకాణం బాగా నడుపుకో.. కానీ అమ్మను మాత్రం మంచిగా చూసుకోవాలి. అమ్మను పట్టించుకోవడం లేదని తెలిస్తే చెంప పగులగొడుతా" అంటూ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఓ చిరు వ్యాపారిని సుతిమెత్తగా హెచ్చరిస్తూనే, ఉదారత చాటుకున్నారు. శనివారం సంగారెడ్డి గంజ్ మైదాన్ ప్రాంతాన్ని జగ్గారెడ్డి పరిశీలించారు. తన కుమారుడి వివాహ వేడుక ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా గంజ్ మైదాన్ వద్దకు వచ్చిన ఆయన, పక్కనే ఉన్న కల్లు కాంపౌండ్‌లోకి వెళ్లారు. అక్కడ మిర్చీలు అమ్ముతున్న ఒక చిరు వ్యాపారితో సరదాగా ముచ్చటించారు. "గతంలో సైకిల్ పుల్లలకు మాంసం పెట్టి, సీకులు కాల్చి ఇచ్చేవారు కదా? ఇప్పుడు మటన్ సీకులు తయారు చేయడం లేదా?" అని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ అడిగారు. ప్రస్తుతం సీకులు చేయడం లేదని, కేవలం మిర్చీలు మాత్రమే అమ్ముతున్నానని సదరు వ్యాపారి తెలిపాడు. సంభాషణ మధ్యలో ఆ వ్యాపారి తల్లి ఆరోగ్యం గురించి జగ్గారెడ్డి విచారించారు. ఇంతలో పక్కనున్న ఒక వ్యక్తి "అతను అమ్మను సరిగా చూసుకోవడం లేదు, కాస్త చెప్పండి" అని జగ్గారెడ్డి దృష్టికి తీసుకెళ్లాడు. దీనిపై తక్షణమే స్పందించిన జగ్గారెడ్డి.. "అమ్మను మంచిగా చూసుకోవడానికి మీకు వచ్చిన రోగం ఏమిటిరా?" అని ప్రశ్నిస్తూ, తన జేబులోంచి రూ. 10,000 సాయంగా అందించారు. "ఈ డబ్బులతో దుకాణానికి కావలసిన వస్తువులు తెచ్చుకుని వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకో. కానీ అమ్మను మాత్రం ప్రాణంగా చూసుకోవాలి. అమ్మను నిర్లక్ష్యం చేశావని తెలిస్తే దెబ్బలు పడతాయి" అని ఆప్యాయంగానే హెచ్చరించి అక్కడ ఉన్నవారిని అలరించారు.



# ఉద్యమకారుడు లక్ష్మణ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎర్రోళ్ల శ్రీనివాస్

- వేముల లక్ష్మణ్ గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు
- బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా



**బచ్చన్నపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** బచ్చన్నపేట మండలం కొన్నే గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్ గౌడ్ ఇటీవల ఆత్మహత్య చేసుకుని మృతి చెందడం పట్ల మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం కొన్నే గ్రామానికి వెళ్లిన ఆయన, లక్ష్మణ్ గౌడ్ నివాసంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా లక్ష్మణ్ గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి, తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. లక్ష్మణ్ గౌడ్ కుటుంబం ఒంటరి కాదని, పార్టీ తరపున, స్థానిక శాసనసభ్యుల తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని, వారి కష్టసుఖాల్లో పార్టీ నాయకత్వం, కార్యకర్తలు ఎల్లప్పుడూ తోడుగా ఉంటారని స్పష్టం చేశారు.

# విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలి

- ఏఐఎస్ఏ రాష్ట్ర కో కన్వీనర్ డి. తిరుపతి
- కాకతీయ యూనివర్సిటీలో ఘనంగా ఏఐఎస్ఏ సభ్యత్వ నమోదు
- విద్యార్థి వ్యతిరేక విధానాలపై ఉద్యమించడమే లక్ష్యం

**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** దేశవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం పోరాటాలు నిర్వహిస్తున్న ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ లో విద్యార్థులు పెద్ద ఎత్తున చేరాలని ఏఐఎస్ఏ రాష్ట్ర కో కన్వీనర్ డి. తిరుపతి పిలుపునిచ్చారు. శనివారం కాకతీయ యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించిన ఏఐఎస్ఏ ప్రత్యేక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమ విప్లవ వీరుల స్ఫూర్తితో 1990లో ఏర్పడిన ఏఐఎస్ఏ, గడిచిన 36 సంవత్సరాలుగా విద్యార్థుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతోందని గుర్తుచేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ఢిల్లీలో జాతీయ అధ్యక్షురాలు నేహా బోరా నాయకత్వంలో ఆమరణ నిరాహార దీక్షలు, నిరసనలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే సర్ రద్దు చేయాలని, సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ విద్యా విధానం పేరుతో పాఠ్యపుస్తకాలలో మూఢనమ్మకాలను ప్రవేశపెట్టేందుకు జరుగుతున్న ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, రాబోయే రోజుల్లో చేపట్టే విద్యార్థి ఉద్యమాలలో విద్యార్థులందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఏ నాయకులు జె. రాజారాం, దండు రమేష్ చంద్ర, బి. ఏలేందర్, దామోదర్, ఉదయ్ కుమార్, ఎడెల్లి శ్రీనివాస్, సాయికుమార్, సురేష్, మణికంఠ, నవతేజ్, జె.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

